# 31. నీకు నచ్చని నిజం

"నువ్వెప్పుడూ పొగుడుతూ ఉంటావే, మన సహదేవరావు; అతను పప్పులో కాలేసిన సంఘటన ఇప్పుడు ముగ్గులో ఉంది. "అన్నాడు ముకుందరావు.

సహదేవరావు యూనివర్సిటీలో నాకు ఏడాది సీనియరు. చదువుకుంటున్న రోజుల్నుండీ కూడా మేధావిగా, చురుకైన వాడుగా, సమయస్ఫూర్తిగల వ్యక్తిగా అతనికి ఖ్యాతి ఉంది. సహదేవరావు జిల్లాకలెక్టరయ్యాడు గాని ముకుందరావు ఆనర్సు చదివీకూడా పి.ఏ. లెవెల్లోనే ఉండిపోయాడు.

ఆనర్స్‌లో సహదేవరావుది సైకాలజీ సబ్జక్టు. సైకాలజీ ప్రొఫెసర్ మహాదేవన్ గారికి ఓ రోజున ఒక ఛాలెంజి వచ్చింది. ఫేకల్టీ క్లబ్బులో ("పేకలూ, టీ - క్లబ్బు" అని తరవాతి కాలంలో ఒక వివరణ వచ్చింది. - అది వేరే సంగతి) ప్రొఫెసర్ నాగభూషణంగారు, ప్రొఫెసర్ సుందర నారాయణగారు, ప్రొఫెసర్ సత్యరామన్ గారు (డబ్బులు వెయ్యకుండా స్కోర్సు మాత్రం వేసుకుంటూ) రమ్మీ ఆడుతున్నారు. కొంచెం దూరంలో నేనూ ముకుందరావూ మేగజైన్స్ చూస్తున్నాం ఎవరు ఎలా పురెక్కించేరో తెలియదు గాని హటాత్తుగా మహదేవన్ గారు సహదేవరావుకి కబురు పెట్టేరు. ప్రొఫెసర్ గారు కబురు పెడితే "ఆయన్నే ఇక్కడికి రమ్మను" అని చెప్పే రోజులు ఇంకా ప్రారంభం కాలేదు. సహదేవరావు ఆ రమ్మీ టేబిల్ దగ్గిరికి వెళ్లి చేతులు కట్టుకుని నుంచున్నాడు. నేను అతనితో వెళ్లినా, కొద్దిగా వెనక్కి తగ్గి; కూత వేటు దూరంలో ఉండిపోయాను. మహదేవన్ గారు మాట్లాడేరు :

"చూడు, సహదేవరావ్; సైకాలజీ ఆనర్స్ నుంచి ఒక్కడు కూడా ఇంతవరకు ఐ.ఏ.ఎస్.కి ఎన్నికకాలేదని; ఆ సబ్జక్టులో అంత చురుకయిన వాళ్ళు దొరకరనీ నా సహాధ్యాయులంటున్నారు. ఈ ఛాలెంజిని నేను నీకు ట్రాన్స్ఫర్ చేస్తున్నాను. వీరికి గర్వభంగం చేసి నాకు గర్వకారణం కాగల విద్యార్థివి నువ్వు ఉన్నావని నేను పందెం వేస్తున్నాను." అని చెప్పి మహదేవన్ గారు జేబులోంచి పర్సూ, పర్సులోంచి నూరు రూపాయల నోటూ తీసి ఆ రమ్మీ టేబిల్‌మీద పెట్టి ఒక గుద్దు వేశారు. "మీరు ముగ్గురూ కలిసి నూరు రూపాయలు కలపండి. నా ఒక్కడి పందెం వంద!" అన్నారు; తన సహాధ్యాయులని ఉద్దేశించి.

సహదేవరావు ఒక్క పదిసెకండ్లు మాత్రం నోరు మెదపకుండా నిలుచున్నాడు. నేను త్వరగా ముందుకొచ్చి మహదేవన్ మాస్టారి చెవిలో "సార్; సహదేవరావుకి అమెరికా నించి డాక్టరేటుకి సంబంధించిన కాగితాలు రావడం, నిన్ననే మీరు ఎండార్సు చేసి పంపడం జరిగిపోయింది కదండి! ఇప్పుడు మీ పందెంకోసం ఇతను ఐ.ఏ.ఎస్. కి కూర్చుంటే ఇతని ఫారిన్ ఛాన్సెస్ పోతాయి కదండి, మేష్టారూ!" అన్నాను. మేష్టారు ఏమీ అన్లేదు. సహదేవరావు నన్ను జబ్బ పట్టుకుని ఇవతలికి లాగేడు. మేస్టారి దగ్గిరిసా వెళ్లి ఒకసారి వంగి వెంటనే నిటారుగా నుంచున్నాడు. "మిమ్మల్ని పందెం గెలిపించే పూచీ నాది, మేష్టారూ; గాడ్ ప్రామిస్!" అన్నాడు. ముందు మహదేవన్ గారు చప్పట్లు కొట్టేరు. తరవాత నేను. ఆతరవాత మిగిలిన ముగ్గురు ప్రొఫెసర్లూ.

ఆ రోజుల్లో అన్నీ విలువైనవే. ఫారిన్ ఛాన్సునుండి నూరు రూపాయల పందెం వరకూ; రమ్మీ టేబిల్ మీద మాటవరసకి విసిరిన సవాలు నుండి మేస్టారంటే భక్తి వరకూ.

సహదేవరావు అమెరికా నుండి స్కాలర్ షిప్పూ డాక్టరేటుకి పిలుపూ వచ్చినా సరే; ఐ.ఏ.ఎస్

కోసం అవి వదిలేసుకుని మహాదేవన్ గార్ని పందెంలో గెలిపించేడు. సైకాలజీ సబ్జక్టుతో చదివి ఐ.ఏ.ఎస్ అయిన మొదటి అభ్యర్థి (కనీసం మా యూనివర్శిటీ వరకు) అతనే. మేథమేటిక్సు, ఇంగ్లీషు, ఇకనామిక్సు ప్రొఫెసర్లు ముగ్గురూ; పందెం ఓడిపోయి నందుకు కంటే తమమూలంగా సహదేవరావు అమెరికా ఛాన్స్ పోయినందుకు ఎక్కువ బాధపడ్డారు.

ఐ.ఏ.ఎస్. "ముఖాముఖి"లో సంగతులేమిటని ప్రొఫెసర్ మహదేవన్‌గారు సహదేవరావుని అడిగినప్పుడు నేను అక్కడే ఉన్నాను. "నువ్వు ఎంత వరకు చదువుకున్నావు అని అడిగేరండి. సైకాలజీలో అయితే ఆనర్సువరకు చదివాను గాని మిగతా సబ్జక్టుల్లో నా చదువు కొలతలకి అందేదికాదని చెప్పానుసార్. ఆ తరవాత సంస్కృతంలో ఒక శ్లోకం చెప్పి ఇంగ్లీషులో అర్థం చెప్పమన్నారు. క్వాంటమ్ మెకానిక్సులో ఒక ఫార్ములా చెప్పి డెరివేషన్ ఇమ్మన్నారు. షేక్స్‌పియర్ నాటకాల్లో ఇటలీ కథాస్థానంగా ఉన్న వాటికి భౌగోళికమైన సమర్థన చెప్పమన్నారు. అన్నీ విని గుడ్లు మిటకరించుకుని ఒకరి మొహాలొకరు చూసుకున్నారు." అని వివరించేడు సహదేవరావు.

"అన్నీ కోతలు! సెలక్టయ్యాడు కనక ఎన్ని కథలైనా చెప్తాడు." అని తీసిపారేశాడు ముకుందరావు; నేనిదంతా చెప్తే విని.

పద్దెనిమిది నెలలు ట్రెయినింగులో సంపాదించుకోవలసిన జ్ఞానం గురించిన పరిణతి పరీక్షలను పదినెలల్లో దాటేసిన సహదేవరావుకి ఇరవై రెండేళ్ల వయస్సప్పుడు సబ్ కలెక్టరు పదవి; ఇరవై నాలుగో ఏడు దాటుతూ ఉండగా జిల్లా కలెక్టరు పోస్టింగూ వచ్చింది. ముకుందరావుకి ఆనర్స్‌లో "పాస్" క్లాసు వచ్చినా, అంతకి ముందు అతను టైపు, షార్ట్‌హేండ్‌ల్లో హయ్యర్ అయిపోయి సూపర్ స్పీడ్ సాధించడం వల్ల డైరక్టుగా సెక్రటేరియట్ సర్వీసెస్‌లో గ్రేడు-వన్ స్టెనో గా ఉద్యోగం వచ్చి; ఛీఫ్ మినిస్టర్ గారి సెక్రెటరీకి పి.ఏ.గా తేలాడు; కేవలం రెండున్నర ఏళ్లలో. హైదరాబాదు గాని అంతకి ముందు కర్నూలు గాని- ఎక్కడికి వెళ్లినా ముకుందరావుని పలకరించకుండా వెనక్కి రాలేదు నేను. ఏపని మీద ముకుందరావుని కలుసుకున్నా మా ఇద్దరి సంభాషణల్లో సహదేవరావు ప్రసక్తి ఒచ్చి తీరేది.

సహదేవరావు పప్పులో కాలేసిన సంఘటన ముగ్గులో ఉందని ముకుందరావు ప్రగల్భంగా చెప్పగానే నాకే ఏదో చిక్కు వచ్చి పడ్డంత బాధ కలిగింది. వివరాలు అడిగాను; పశ్చాత్తాపంలాంటి న్యూనతాభావంతో. ముకుందరావు ఎవరికో టెలిఫోన్‌లో ఏదో సమాధానం చెబుతూ చెక్క బీరువాలోంచి ఒక ఫైలు తీసి నాముందు పెట్టేడు. దానిమీద "అతి రహస్యం" అని ఇంగ్లీషులో ఎర్ర అక్షరాలలో వేసిన అచ్చు లేబిల్ ఉంది. ఫ్యూన్‌ని కాఫీ నెపంతో బైటకి పంపించేసి ఫైలు తెరిచి నా వేపు తిప్పేడు ముకుందరావు.

సహదేవరావు కలెక్టర్‌గా పనిచేస్తున్న జిల్లా ముఖ్యపట్టణంలో ఒకే ఒక ప్రభుత్వ అతిథి గృహం ఉంది. దాంట్లో ఆరు "సూట్స్" (ఆర్భాటమైన గదులు) ఉన్నాయి. సుమారు పది రోజుల కిందట ముఖ్యమంత్రిగారు ఆవూరు (ఎన్నికల ప్రచారం అసలు పనిగా) "జిల్లా యంత్రాంగం పని సమీక్షణం కోసం" వస్తున్నామని తెలియజేస్తూ; తమతో మరో ఇద్దరు మంత్రులూ ముగ్గురు అనుయాయులూ వస్తున్నారు గనుక తాము ఆ ఊళ్లో ఉందామనుకుంటున్న మూడు రోజులూ ఆ అతిథి గృహం అంతా తమపేర ఉండే విధంగా ఏర్పాట్లు చేయమని కోరారు. "గెస్టు హవుసు ఖాళీగాలేదు. ముఖ్యమంత్రి గారూ పరివారం, తమ విజిట్ వాయిదా వేసుకోవడంగాని; ప్రయివేటు వసతికి అంగీకరించడం గాని చేయవలసిందిగా కోరడమైనది." అని టెలిగ్రాం ఇస్తూ; అదే సందేశాన్ని

జాబుగా కూడా ఎక్స్‌ప్రెస్ డెలివరీలో పంపాడు. జిల్లా కలెక్టర్ సహదేవరావు. ఫైలు మీద ఈ సమాచారం అంతా చూసిన ముఖ్యమంత్రి గారు "వివరణ కోరండి" అని వ్రాస్తూ తమ కార్యక్రమాన్ని తప్పనిసరిగా వాయిదా వేసుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రిగారి కార్యదర్శి సహదేవరావు పేరిట ఒక ఉత్తరం పంపారు. అందులో పదజాలం క్లుప్తంగా, తీవ్రంగా ఉంది.

"దీంతో సహదేవరావు పని సరి. ఏ మారుమూల డిపార్టుమెంటుకో డైరక్టరుగా పారేస్తారు అతన్ని. ఎంత పొగరుకి అంత శిక్ష." అన్నాడు ముకుందరావు; ఫైల్ ముడిచేసి, కట్టేసి, దాచేసి. "అసలు సంగతేమిటో తెలుసా? ముఖ్యమంత్రిగారు ప్రోగ్రాం వేసుకున్న ఆ మూడు రోజులకీ గెస్ట్‌హౌసు ఒక ప్రతిపక్ష నాయకుడికి; అందులోనూ ఎన్నికల ప్రచారానికి వస్తున్నామని రాస్తేకూడా; సహదేవరావు అతనికి ఆ వసతి ఖాయం చేసేడని ఇంటిలిజెన్స్ రిపోర్టు. ఇది చాలా తీవ్రమైన నేరం. ముఖ్యమంత్రి గారి ప్రోగ్రాం రాగానే ఆ ఎలాట్‌మెంట్ రద్దుచేసి ఆ ప్రతిపక్షనాయకుణ్ణే ప్రయివేటు వసతి చూసుకొమ్మని సలహా ఇవ్వాలి." అని ముకుందరావు స్పష్టీకరిస్తే నాకు ప్రాణం చివుక్కుమంది. ఫ్యాన్ కాఫీ తెస్తాడు; అది పుచ్చుకోకపోతే ముకుందరావు బాధపడతాడు - అనైనా ఆలోచించకుండా లేచి వచ్చేశాను.

ఆ రోజంతా బుర్ర మసీదైపోయింది. నాకు మా డిపార్ట్‌మెంట్‌లో జరిగిన ఒక అన్యాయాన్ని ముకుందరావు దృష్టికి తెచ్చి; శాఖాపరంగా నేను పెట్టుకున్న "అన్యాయ నివారణ విన్నపం" ఒక దారికి వచ్చేట్టు చూడమని అతన్ని కోరుదామని వెళ్లీ కూడా అతని దగ్గిర ఆ ప్రస్తావన తీసుకురాలేదు. సహదేవరావు తప్పుడు నిర్ణయం తీసుకుని తన భవిష్యత్తుకి మబ్బుకమ్మించుకున్నాడనే బాధకంటె; కాలేజీలో, యూనివర్సిటీలో - ఉన్ననాటి నుంచి ముకుందరావుకి అతనిమీద ఉన్న అసూయా పరమైన చులకన భావం- అది కసిగామారిందన్న బాధ, కేవలం స్థాన బలం వల్ల ముకుందరావు పొందుతున్న ఆనందం నాకు విపరీతమైన వేదన తెచ్చిపెట్టాయి. హైదరాబాదునుంచి విజయనగరానికి దారి రాయలసీమ ద్వారా దూరమని తలచక తిన్నగా సహదేవరావు పనిచేస్తున్న ఊరికివెళ్లాను.

"ఈయన అధికార పార్టీవారే. ముఖ్యమంత్రే. ఎన్నికల ప్రచారం కోసం వస్తానని కాకుండా ప్రభుత్వపు పనిమీద వస్తున్నాననే అన్నారు. నిజమే.

"ఆయన ప్రతి పక్ష నాయకుడే. ఎన్నికల ప్రచారం కోసం వస్తున్నాననే వ్రాశాడు. అదీ నిజమే.

"కాని ఈ ప్రతిపక్షనాయకుడు అసాధారణ మర్యాదకి అర్హుడు. ఎందుకంటే ఆయన భారతదేశ స్థాయి నాయకుడు. భారతదేశానికి చిట్టచివరి గవర్నర్ జనరల్‌గా పనిచేశారు. నాదృష్టిలోనే కాక, రాజ్యాంగ ప్రమాణాలను అనుసరించి కూడా ఆయన భారత రాష్ట్రపతితో సమానమైన గౌరవం పొందాలి. కనక నా నిర్ణయం సమంజసమే." అని చెప్పాడు సహదేవరావు. అలా వివరిస్తూ ముఖ్యమంత్రి కార్యదర్శికి (ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి కాపీతో సహా) రాసిన లేఖ సంగతి చెప్పాడు.

ఏమీ అవలేదు. సహదేవరావు రాజకీయవాదుల దృష్టిలో కొరక రాని కొయ్యగా కొనసాగినా, మేధావిగా, సమయస్ఫూర్తిగల అధికారిగా నిలిచి తన గౌరవాన్ని కాపాడు కోగలిగాడు. ※

*("ఆంధ్రభూమి" డెయిలీ : 12-2-92)*